సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



భద్రకాళీ అమ్మవారికి స్వర్ణాభరణం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారికి గ్రామానికి చెందిన గోకవరపు మంగతాయారు కుటుంబ సభ్యులు స్వర్ణాభరణం (రూ.లక్ష) సమర్పించారు.



రూ.లక్ష విరాళం

అయినవిల్లి: నల్లచెరువులో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ మందిర్‌కు కుడుపూడి త్రిమూర్తులు (కొత్తపేట మండలం బిళ్లకుర్రు) సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు.

డెల్టాలకు 12,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 12,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,900, మధ్య డెల్టాకు 2,100, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

సమస్యల నాడి పట్టరేం?

- కూటమి ప్రభుత్వంపై వైద్యుల గుర్రు
- విధులు బహిష్కరించి సమ్మెలోకి పీహెచ్‌సీల డాక్టర్లు
- జిల్లాలో పలుచోట్ల నర్సులతోనే వైద్య సేవలు

సాక్షి, అమలాపురం/ ముమ్మిడివరం: చెప్పి చెప్పి విసిగిపోయారు.. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మొరపెట్టుకున్నా, కూటమి సర్కారు పట్టించుకోక పోవడంతో వైద్యులు స్టెత్‌ను పక్కనపెట్టారు.. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సమ్మెకు దిగారు. ఫలితంగా పల్లెల్లో వైద్య సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో రోగులు ఇబ్బంది పడ్డారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీలు) వైద్యులు విధులను బహిష్కరించారు.

తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా 53 పీహెచ్‌సీలు ఉండగా, ప్రతి చోటా వైద్యులు విధులకు దూరంగా ఉన్నారు. అత్యవసర సేవలు మాత్రమే అందిస్తామని, ఓపీ, ఇతర సేవలకు దూరంగా ఉంటామని తేల్చి చెప్పారు. వైద్యుల సమస్యలను పరిష్కరిస్తామని గత ఏడాది ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ బుట్టదాఖలు కావడంతో వారు సమ్మె బాట పట్టారు. గత 20 ఏళ్ల నుంచి తమకు పదోన్నతులు లేకుండా పోయాయని, టైమ్ బాండ్ పదోన్నతులు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జీఓ 99ను రద్దు చేసి ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న వైద్యులకు 50 మూల వేతనాన్ని గిరిజన భత్యంగా అందించాలని, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేల భత్యం ఇవ్వాలనే తదితర డిమాండ్లతో వారు సమ్మెకు దిగారు. ఆయా పీహెచ్‌సీల వద్ద తమ డిమాండ్‌లో కూడిన నోటీసులు అతికించి ఓపీ సేవలు బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. పీహెచ్‌సీలలో వైద్యుల ద్వారా అందాల్సి సేవలు నిలిచిపోయాయి. చివరకు జిల్లా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ– – సశక్త్ పరివార్ అభియాన్ క్యాంపులో కూడా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులు సేవలందించాల్సి వచ్చింది.



ముమ్మిడివరం మండలం కొత్తలంకలో రోగులకు మందులు అందిస్తున్న స్టాఫ్‌నర్స్



వైద్యులు సమ్మెకు వెళ్లడంతో రాయవరం పీహెచ్‌సీలో రోగులకు మందులు అందజేస్తున్న స్టాఫ్‌నర్స్



మలికిపురం మండలం లక్కవరంలో స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ క్యాంప్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ద్రాక్షారామ పీహెచ్‌సీ గోడకు వైద్యులు అతికించిన సమ్మె నోటీసు

ఉన్నవారితో మమ అనిపించి..

- మండపేట నియోజకవర్గం పరిధిలో మండపేటలో రెండు, కపిలేశ్వరపురంలో మూడు, రాయవరం రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. వైద్యులు విధులకు హాజరు కాలేదు. రోగులకు స్థానికంగా ఉన్న ఫార్మసిస్టులు, నర్సులు తాత్కాలికంగా మందులు అందించి పంపించారు. చిన్న చిన్న పరీక్షలను నర్సులు నిర్వహించారు. ఓపీ లేకపోవడంతో గ్రామీణ ప్రజలకు వైద్యం అందని పరిస్థితి నెలకొంది. దీనితో వారు ప్రైవేట్ వైద్యులను, ఆర్‌ఎంపీలను ఆశ్రయించాల్సి వచ్చింది.
- ముమ్మిడివరం నియోజకవర్గం కొత్తలంక పీహెచ్‌సీలో సోమవారం ఇద్దరు వైద్యులూ సమ్మెలో ఉండటంతో ఆసుపత్రి స్టాఫ్ నర్సు, ఫార్మాసిస్ట్ రోగులకు వైద్య సేవలందించారు. స్టాఫ్ నర్సు పి.నాగలక్ష్మి, ఫార్మసిస్ట్ ఎం.శ్రీనివాస్‌లు రోగులకు ప్రాథమిక పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ ఒక్క రోజు 38 మంది ఆసుపత్రికి వచ్చి సేవలు పొందారని తెలిపారు. అయితే రిఫరల్ కేసులు ఏవీ రాకపోవడంతో ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. కాట్రేనికోన పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సులు వైద్య సేవలందించారు. 83 ఓపీ నమోదైంది. సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పల్లంకుర్రు పీహెచ్‌సీకి మత్స్యకార గ్రామాల నుంచి జ్వరపీడితులు, ఇతర వ్యాధిగ్రస్తులు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- రామచంద్రపురం నియోజకవర్గంలో మొత్తం ఏడు పీహెచ్‌సీలు ఉండగా వైద్యుల ద్వారా సేవలందలేదు. కేవలం నర్సులు మాత్రమే ప్రాథమిక చికిత్స చేసి పంపారు.
- రాజోలు నియోజకవర్గం పరిధిలో ఏడు పీహెచ్‌సీలు ఉండగా వైద్యులు విధులు హాజరు కాలేదు. స్టాఫ్ నర్సుల ద్వారా వైద్య సేవలందించారు. స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ క్యాంప్‌లో కూడా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులు సేవలందించారు.
- కొత్తపేట నియోజకవర్గం పరిధిలో కూడా ఇంచుమించు ఇదే పరిస్థితి. ఇక్కడ మొత్తం ఎనిమిది పీహెచ్‌సీలు ఉండగా, ప్రతిచోటా వైద్యుడి స్థానంలో స్టాఫ్ నర్సులు వైద్య సేవలందించాల్సి వచ్చింది.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నేడు నిరసన



గొల్లపల్లి డేవిడ్‌రాజు

కొత్తపేట: రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైఎస్సార్ **సీపీ ఎస్సీ విభాగం** ఆధ్వర్యంలో **మంగళవారం** అమలాపురంలో **జరిగే నిరసన కార్యక్రమాన్ని** జయప్రదం **చేయాలని** ఆ విభాగం **జిల్లా అధ్యక్షుడు** గొల్లపల్లి డేవిడ్‌రాజు పిలుపు **నిచ్చారు. సోమవారం** రాత్రి కొత్తపేటలో ఆయన మాట్లాడుతూ పేద, సామాన్య వర్గాలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టి, కొన్ని కళాశాలలను ప్రారంభించిందన్నారు. మరికొన్ని నిర్మాణ దశలో ఉండగా కూటమి ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం ప్రైవేటీకరించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఈ చర్య పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమేనని అన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజే సుధాకర్‌బాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపు మేరకు అమలాపురం ఈదరపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. దీనికి జిల్లాలోని పార్టీ శ్రేణులు, యువత తరలిరావాలని డేవిడ్‌రాజు పిలుపునిచ్చారు.

లంకల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం రూరల్: ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి పెరుగుతుండడంతో జిల్లాలోని లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కాటన్ బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారని, మంగళవారం రెండో ప్రమాద హెచ్చరికకు వరద నీరు చేరుకునే అవకాశం ఉందన్నారు. దీంతో గోదావరి తీరం వెంబడి తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తం కావాలని సూచించారు. ఇప్పటికే కొన్ని గ్రామాల కాజ్ వేలపై వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయని, బోట్ల సహకారంతో అత్యవసర పనులు ఉన్నవారిని మాత్రమే తరలించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత



ఈవీఎం గోదాము సీళ్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్ తదితరులు

ముమ్మిడివరం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు భద్రపర్చిన గోదాముల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు భద్రపరిచిన గోదాములను ఆయన తనిఖీ చేశారు. తొలుత కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోదాములకు వేసిన సీళ్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, తదితర వాటిని పరిశీలించారు. అనంతరం సెక్యూరిటీ లాగ్ బుక్‌ను పరిశీలించి అందులో సంతకం చేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసు గార్డులను ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ శివరాజ్, రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



పీజీఆర్ఎస్‌లో అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: ప్రజల అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను హెచ్చరించారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిషాంతి, డీఆర్వో మాధవి, డ్వామా పీడీ మధుసూదన్, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీలు ప్రజల నుంచి సుమారు 162 అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను పూర్తిగా విని చక్కని పరిష్కారం చూపాలన్నారు. జాయింట్ కలెక్టర్ నిషాంతి మాట్లాడుతూ అర్జీల పరిష్కారాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు.

మిథున్‌రెడ్డికి బెయిల్ ఇవ్వడం సముచితం



బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో భాగంగా తప్పుడు కేసు బనాయించి 71 రోజులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉంచిన ఎంపీ మిథున్‌రెడ్డికి కోర్టు బెయిల్ ఇవ్వడాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ స్వాగతించారు. సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చిన మిథున్ రెడ్డిని ఎమ్మెల్సీ సోమవారం కలిశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు పెట్టడంపై కోర్టులు ఎన్ని మొట్టికాయలు వేసినా కూటమి ప్రభుత్వ తీరు మారడం లేదని ఎమ్మెల్సీ అన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం ముందు రెడ్‌బుక్ రాజ్యాంగం పనిచేయదని, అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్నారు. మిథున్‌రెడ్డికి బెయిల్ రావడం ద్వారా అక్రమ కేసులు ముందు ముందు నిలబడవన్న సంకేతాన్ని ఇస్తోందని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 36 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్య పరిష్కార వేదికకు 36 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఎస్పీ రాహుల్ మీనా ఫిర్యాదు పత్రాలు స్వీకరించారు. ఎస్పీ మీనా కూలంకుషంగా వారి సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపించారు. సమస్య తీవ్రతను బట్టి డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో ఫోన్‌లో మాట్లాడారు. వచ్చిన అర్జీల్లో ఎక్కువగా కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి.

ఎంపీ మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం

- సెంట్రల్ జైలు వద్దకు భారీగా చేరుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఎయిర్‌పోర్ట్ వరకూ బైక్ ర్యాలీ

సాక్షి, రాజమహేంద్రవరం: లిక్కర్ అక్రమ కేసులో అరెస్టయ్యి, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పత్రాలను పరిశీలించిన జైలు అధికారులు మిథున్‌రెడ్డిని సాయంత్రం 5.55 గంటలకు విడుదల చేశారు. ఎంపీ విడుదల విషయాన్ని తెలుసుకున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సెంట్రల్ జైలు వద్దకు చేరుకున్నారు. మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. దీంతో జైలు వద్ద కోలాహలం నెలకొంది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నేతృత్వంలో భారీ బైక్, కార్ల ర్యాలీ నిర్వహించారు. సెంట్రల్ జైలు నుంచి మధురపూడి ఎయిర్‌పోర్ట్ వరకూ ఈ ర్యాలీ సాగింది. మిథున్‌రెడ్డికి స్వాగతం పలికిన వారిలో ఆయన తండ్రి, మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎంపీ, పార్టీ అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్, కొవ్వూరు, అనపర్తి కో ఆర్డినేటర్లు తలారి వెంకట్రావు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పార్టీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, కోనసీమ, కాకినాడ జిల్లాల నేతలు పాల్గొన్నారు.



బెయిల్‌పై విడుదలైన మిథున్‌రెడ్డికి సెంట్రల్ జైలు వద్ద స్వాగతం పలుకుతున్న నేతలు

స్వాగతిస్తున్నాం

కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. పెద్దిరెడ్డి కుటుంబాన్ని వేధించేందుకు చంద్రబాబు చేసిన కుట్ర ఇది. బెయిల్ మంజూరును స్వాగతిస్తున్నాం. హామీలు అమలు చేయలేక ప్రజల దృష్టి మరల్చేందుకే కూటమి సర్కారు అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేస్తోంది. మిథున్‌రెడ్డికి ఈ కేసుతో సంబంధం లేదు.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

దుర్మార్గమైన కేసు

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుతో కాలక్షేపం చేస్తోంది. సంబంధం లేని కేసును ఎంపీ మిథున్‌రెడ్డిపై పెట్టారు. ఆయనపై ఉన్నది అభియోగం మాత్రమే. కేసులో ఏం సంబంధం ఉందో చెప్పలేకపోయారు. కూటమి ప్రభుత్వానికి పతనం ప్రారంభమైంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. దుర్మార్గ పాలనను తుదముట్టిస్తారు.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ

చంద్రబాబు శాడిజం

ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం పెట్టినది మ్యానేజ్‌డ్ కేసు. ఈ విషయాన్ని మొదటి నుంచీ చెబుతూనే ఉన్నాం. బెయిల్ పత్రాలు వచ్చినా విడుదల చేసేందుకు కావాలనే ఆలస్యం చేశారు. ఇది చంద్రబాబు శాడిజానికి నిదర్శనం. చంద్రబాబు ఎప్పుడూ అంతే. హింసించి ఆనందం పొందుతారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బాబు ఎవరు?

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్

ముమ్మాటికీ కక్ష సాధింపే

పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష సాధించేందుకే ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు. ఆయన జైలు నుంచి బయటకు రావడంతో పార్టీ శ్రేణులు పండగ చేసుకుంటున్నారు. న్యాయం ఎప్పటికీ గెలుస్తుంది. అందుకు మిథున్‌రెడ్డికి వచ్చిన బెయిలే నిదర్శనం.

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ అనపర్తి కో ఆర్డినేటర్

సరస్వతీ.. జ్ఞానప్రదాత్రీ

దసరా శరన్నవరాత్ర ఉత్సవాలను జిల్లాలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో ఎనిమిదో రోజు చదువుల తల్లిగా అలంకరించారు. ఇందులో భాగంగా అమలాపురం పట్టణం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గమ్మ, వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో వైష్ణవీ కనకదుర్గమ్మ ఆలయం, వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం, గోల్డ్ మార్కెట్‌లో కామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు.

–అమలాపురం టౌన్



రజత చీరలో మురమళ్ల భద్రకాళీ అమ్మవారు



సరస్వతీ దేవిగా అలంకృతమైన అమలాపురం శ్రీదేవి అమ్మవారు

శిక్షణకు వచ్చేసారు

- డీఎస్సీ–2025 ఉపాధ్యాయులకు బోధనలో మెళకువలు
- ఉమ్మడి జిల్లా పరిధిలో 1,698 మందికి తరగతులు
- వచ్చే నెల 3 నుంచి 10 వరకూ నిర్వహణ
- చివరి రోజు శిక్షణ కేంద్రాల్లోనే పోస్టింగ్ ఆర్డర్లు

రాయవరం: డీఎస్సీలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 1,352 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే నాలుగు పోస్టులకు అర్హులు లేక 1,349 పోస్టులకు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఇదిలా ఉంటే జోన్–2 పరిధిలోని 347 మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్లు (పీజీటీ)కు కూడా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తం 1,698 మందికి ఏడు చోట్లలో శిక్షణ ఇస్తారు. విధుల్లో చేరే ముందే కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలు నేర్పేందుకు సబ్జెక్టుల వారీగా సమాయత్తం చేస్తున్నారు. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలోనే ఉంటుంది. ఉపాధ్యాయులు విద్యా బోధనలో ప్రావీణ్యం కలిగి ఉండేలా తయారు చేయడం శిక్షణ ప్రధాన ఉద్దేశం. అలాగే విద్యా శాఖ ప్రవేశపెట్టిన విధి విధానాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యాహక్కు, బాలల హక్కు చట్టాలు, అందులోని ముఖ్య విషయాలను తెలియజేయడం, బాధ్యతలు వివరించడం, పాఠ్య ప్రణాళికలు తయారు చేయడం, మూల్యాంకన విధానాలు నేర్పించడం, డిజిటల్ టూల్స్, టెక్నాలజీ ద్వారా కొత్త బోధన విధానాలను పరిచయం చేయడం, వృత్తి నైపుణ్యం, నియమాలు పాటించడం, విద్యార్థులకు ఆదర్శంగా నిలవడం తదితర అంశాలపై వీరికి 8 రోజుల శిక్షణలో అవగాహన కల్పిస్తారు.

10న పోస్టింగ్ ఆర్డర్లు

అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకూ శిక్షణ ఇచ్చేందుకు తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రదేశాల్లో శిబిరాలను ఏర్పాటు చేశారు. 527 మంది ఎస్జీటీలు, 132 మంది స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, 211 మంది ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్, 236 మంది ఎస్ఏ తెలుగు, ఇంగ్లిషు, హిందీ, 245 మంది ఎస్ఏ గణితం, పీఎస్, బయాలజీ టీచర్లకు శిక్షణ ఇస్తారు. వీరితో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో ఎంపికైన పీజీటీలకు కూడా రాజమహేంద్రవరంలోనే శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ శిబిరం చివరి రోజు 10న ఆయా శిక్షణ కేంద్రాల్లోనే కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి, పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. అక్టోబర్ 13న నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరాల్సి ఉంటుంది.



శిక్షణ శిబిరాలు ఎక్కడంటే..

శిక్షణ శిబిరం	సబ్జెక్టు	సంఖ్య
ఎస్ఎస్‌పీ పాలిటెక్నిక్ కళాశాల, కొండగుంటూరు	ఎస్జీటీ	300
రాజమహేంద్రి ఇంజినీరింగ్ కళాశాల, పిడింగొయ్యి	ఎస్జీటీ	227
జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ–1	జోన్–2 పీజీటీ	347
జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ–2	ఎస్ఏ (సోషల్)	132
ఐఎస్‌టీఎస్ ఉమెన్ ఇంజినీరింగ్ కాలేజీ, రాజానగరం	ఎస్ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	211
సాయిమాధవి ఇంజినీరింగ్ కాలేజీ, మల్లంపూడి, రాజానగరం	ఎస్ఏ (లాంగ్వేజెస్)	236
బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీ,	ఎస్ఏ (మ్యాథ్స్, ఫిజిక్స్, బీఎస్)	245

రిలీవ్ కానున్న బదిలీ ఉపాధ్యాయులు

చాలా రోజులుగా ఉమ్మడి జిల్లాలో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో పలువురు కోరుకున్న స్థానాల్లో నేటికీ చేరలేదు. ఉపాధ్యాయుల కొరత ఉండడంతో బదిలీ జరిగిన ఉపాధ్యాయులనే వెనక్కి పంపించిన అధికారులు పాఠశాలల నిర్వహణ సాగిస్తున్నారు. కొత్త ఉపాధ్యాయుల చేరికతో బదిలీ అయి రిలీవ్ కాలేని ఉపాధ్యాయుల సమస్యకు పరిష్కారం లభించే అవకాశముంది.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తగా విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకూ శిక్షణ ఉంటుంది. భోజన వసతితో పాటు ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈఓ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ప్రతి ఒక్కరూ హాజరు కావాల్సిందే



కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో శిక్షణకు హాజరు కావాల్సిందే. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లో మొత్తం ఏడు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశాం.

– జి.నాగమణి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ఏనుగమ్మా... ఏనుగు

- గొల్లపాలెంలో ఏనుగుల సంబరం ప్రసిద్ధి
- దసరా రోజున భారీ ఊరేగింపు
- పోటీపోటీగా ఉత్సవాల నిర్వహణ



గొల్లపాలెంలో బండిపై చిన్న ఏనుగు ప్రతిమ ఊరేగింపు (ఫైల్)



రాత్రి సమయంలో ట్రాక్టర్‌పై పెద్ద ఏనుగు సంబరం (ఫైల్)

కాజులూరు: దసరా.. ప్రతి పల్లెకూ ప్రత్యేకతే. అచ్చం అలానే కాజులూరు నియోజకవర్గం గొల్లపాలెంలో ఏనుగుల సంబరం ప్రఖ్యాతి గాంచింది. ఏటా విజయ దశమిని పురస్కరించుకుని ఇక్కడ ఏనుగుల సంబరాలు నిర్వహించడం అనాదిగా వస్తోంది. సాధారణంగా ప్రతి గ్రామంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో దుర్గాదేవి అమ్మవారిని పూజిస్తుంటారు. అయితే గొల్లపాలెంలో పాత మార్కెట్ సెంటర్ వద్ద రామాలయం సమీపంలో మాత్రం శరన్నవరాత్ర రోజుల్లో భేతాళునికి పూజలు నిర్వహించడం విశేషం. చివరి రోజు దసరా పండగ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ గ్రామ వీధుల్లో చిన్న ఏనుగు ప్రతిమను, రాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ ట్రాక్టరుపై పెద్ద ఏనుగు ప్రతిమను ఊరేగిస్తుంటారు. సుమారు రెండు వందల ఏళ్ల నుంచి ప్రతి ఏటా ఈ సంబరం నిర్వహిస్తుండడం విశేషం. ఐరావతాన్ని తలపించేలా తెల్లని వస్త్రం, ఎండు గడ్డితో తయారు చేసిన ఏనుగు ప్రతిమలకు పెద్ద, పెద్ద చావిళ్లు నిర్మించి ఏడాది పొడవునా స్థానికులు వాటిని పరిరక్షిస్తుంటారు. విజయ దశమికి 10 రోజుల ముందు ఏనుగు ప్రతిమలను బయటకు తీసి శుభ్రం చేసి మెరుగులు దిద్ది ప్రత్యేక పూజలు చేసి సంబరం చేస్తారు. ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ గ్రామంలోని వెలమ కులస్తుల ఆధ్వర్యంలో చిన్న ఏనుగు సంబరం, కాపు, బలిజ కులస్తుల సారథ్యంలో పెద్ద ఏనుగు సంబరం చేస్తుంటారు. చిన్న ఏనుగును ఎడ్లబండి మాదిరి బండిపై ఉంచి భక్తులు జేజేలు పలుకుతూ తోసుకుంటూ ముందుకు సాగుతారు. పెద్ద ఏనుగునైతే ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగింపు నిర్వహిస్తారు. ఎండు గడ్డి, తెల్లని వస్త్రం, తదితర వస్తువులతో తయారు చేసిన భారీ ఏనుగుల ప్రతిమలను ఊరేగించే సమయంలో వేలాది మంది ముందుకు సాగుతుంటారు. భేతాళుని రూపంలో భక్తులు ఏనుగుల ప్రతిమలకు పూజలు చేస్తుంటారు. గరగ నృత్యాలు, కోయ డ్యాన్సులు, గారడీ, బ్యాండ్ మేళాలతో ఈ ఊరేగింపు కోలహలంగా సాగుతోంది. ఇరువర్గాల వారూ పోటీపోటీగా సంబరం నిర్వహిస్తుండడం ఇక్కడ ప్రత్యేకత. గతంలో ఈ సంబరాల్లో ఘర్షణలు జరిగేవి. పెద్దలు సఖ్యత కుదర్చడంతో ఇటీవల ప్రశాంతంగా జరుగుతున్నాయి. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి ఉత్సవాలను తిలకిస్తుంటారు. అలాగే బాణసంచా కాల్పులకు ప్రత్యేకత ఉంది. రాత్రి మిరుమిట్లు గొలిపేలా ఇక్కడ సంబరాలు నిర్వహిస్తున్నారు.

అనాదిగా వస్తున్న ఆచారం



గొల్లపాలెంలో ఏనుగుల సంబరం అనాదిగా వస్తుంది. గ్రామంలో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. జీవనోపాధి నిమిత్తం సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం ఈ పండగకు తిరిగి గ్రామానికి వస్తుంటారు.

–టేకుమూడి దుర్గారావు, స్థానికుడు

సంప్రదాయాలను కొనసాగిస్తూ..



ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరూ కాస్త తీరిక దొరికితే సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతుంటారు. పండగలు, సంబరాలను మరిచిపోతున్నారు. ఈ నేపథ్యంలో మన ఆచారాలను తెలిపేలా పురాతన సంప్రదాయాలు కొనసాగిస్తూ నేటికీ ఏనుగుల సంబరాలు నిర్వహించడం అభినందనీయం.

–జొన్నకూటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు

భర్త ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ప్రసన్నకుమార్

సీతానగరం: భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నాగంపల్లికి చెందిన గుడాల ప్రసన్న కుమార్ (34) భార్యపై అనుమానం పెంచుకుని మనస్తాపంతో ఉన్నాడు. ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పనిలోకి వస్తానని చెప్పి రాకపోవడంతో స్థానికులు మధ్యాహ్నం ఇంటికి వెళ్లగా అతను ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అల్లంపల్లి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు

యువకుడి బలవన్మరణం



మృతి చెందిన అనిల్ దేవ

సీతానగరం: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సీతానగరం మండలం మునికూడలికి చెందిన మురాల అనిల్ దేవ (22) వెల్డర్‌గా పని చేస్తున్నాడు. తల్లి కువైట్‌లో ఉండటంతో అమ్మమ్మ నూకతట్ల సుభద్రమ్మ వద్ద ఉంటున్నాడు. ఉదయం పనిపై వేరే వీధిలోకి సుభద్రమ్మ వెళ్లగా, ఇంట్లో ఫ్యాన్‌కు అనిల్‌దేవ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుభద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని ఎస్సై వివరించారు.


గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: గంజాయి క్రయ, విక్రయాలతో పాటు తరలింపులో ఆరితేరిన ముగ్గురు నేరస్తులను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్పీ బిందుమాధవ్ సోమవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 23న విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు ఒక ఇన్నోవా వాహనం అనుమానాస్పద రీతిలో పోలీసులను, టోల్ ప్లాజా సిబ్బందిని ఢీకొని దూసుకుని వెళ్లినట్టు ఆ వాహనం కదలికలపై నిఘా ఉంచాలని విశాఖ జిల్లా పోలీసులు కాకినాడ జిల్లా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. విశాఖ పోలీసులు తెలిపిన వాహనాన్ని జగ్గంపేట సర్కిల్ పరిధిలో కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద ఈ నెల 23న మధ్యాహ్నం గుర్తించారు. కారును ఆపే క్రమంలో డ్రైవర్ కారులో నుంచి పోలీసులతో పోరాడాడు. ఈ క్రమంలో కారు అద్దాలు బద్దలైనా లెక్కచేయకుండా ప్రత్తిపాడు వైపు వేగంగా దూసుకుపోయాడు. అయితే ఈ పెనుగులాటలో పోలీసులకు డ్రైవర్ సెల్‌ఫోన్ లభ్యమైంది. ఆ వాహనంలో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు మహిళలు ఉన్నట్టు, వెనుక సీట్లో పోలీస్ యూనిఫాం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వాహనంపై ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని రాసి ఉందని నిర్ధారించుకున్నారు. ప్రత్తిపాడు వైపు వెళుతున్న ఆ వాహనాన్ని వెంబడించగా, కొంత దూరంలో ఆ వాహనం మిస్సైంది. ఇదిలా ఉంటే టోల్‌ప్లాజా వద్ద ఘటన జరిగిన కొద్ది గంటల తర్వాత కిర్లంపూడిలో పైడితల్లి అమ్మవారి గుడి పక్కన ఉన్న రోడ్డుపై వెళుతున్న కారు నుంచి పడిపోయిన రెండు గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ పుటేజీల ఆధారంగా టోల్‌ప్లాజా వద్ద రచ్చ చేసిన కారు నుంచే ఈ ప్యాకెట్లు పడ్డాయని పోలీసులు నిర్ధారించుకున్నారు. సాంకేతికత, ఈగల్ టీమ్ సహకారంతో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కారును ట్రాక్ చేసే పనిలో పడింది. పోలీసుల కష్టం ఫలించి కారు కిర్లంపూడి మండలం రాజుపాలెం సమీపంలో ఒక రావిచెట్టు వద్ద లభ్యమైంది. కారుతోపాటు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు రాజస్థాన్‌కు చెందిన వారని విశాఖ ఏజెన్సీ ప్రాంతంలోని జి.మాడుగలకు వ్యాపారం నిమిత్తం వచ్చారని గుర్తించారు. వ్యాపారం ముసుగులో విశాఖ, ఒడిశా నుంచి గంజాయిని సేకరించి రాజస్థాన్ తరలిస్తున్నట్టు నిర్ధారించారు. వీరిపై కేసు నమోదు చేశామని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. అలాగే జొన్నాడ టోల్ ప్లాజా వద్ద సిబ్బంది, పోలీసులను గాయపరిచిన ఘటనలో భీమునిపట్నం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయ్యిందన్నారు. నిందితుల నుంచి సుమారు రూ.20 లక్షల విలువ చేసే 175 కిలోల గంజాయితో పాటు ఇన్నోవా కారు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నేరంలో ఏడుగురు భాగస్వాములు అయినట్టు గుర్తించామన్నారు. ఇందులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఎస్పీ వివరించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

సరస్వతీ కటాక్షంతో విజయం తథ్యం



విజయదుర్గా పీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



సరస్వతీదేవి అవతారంలో వెదురుపాక విజయదుర్గమ్మ వారు

విజయదుర్గా పీఠం పీఠాధిపతి ‘గాడ్’

రాయవరం: సరస్వతీ కటాక్షం ఉంటే విజయం తథ్యమని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. పీఠానికి వచ్చిన భక్తులనుద్దేశించి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగిస్తూ.. జ్ఞానప్రదాయినిగా ఉన్న సరస్వతీ అమ్మవారి కరుణా కటాక్షాలు కలగడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. జ్ఞాన సంపన్నులుగా మెలగాలంటే మంచి వాక్‌శుద్ధి లభించాలన్నారు. అమ్మవారి దయకు పాత్రులు కావాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పీఠం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులు పీఠంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. పీఠంలో విజయదుర్గమ్మ వారిని సరస్వతీమాత అవతారంలో అలంకరించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పెదపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమా తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

సరస్వతీదేవికి పూజలు

చిన్నారులకు విద్యాబుద్ధులు కలగాలని ఆకాంక్షిస్తూ విజయదుర్గా పీఠంలో సరస్వతీ పూజలు నిర్వహించారు. చీమలకొండ వీరావధాని, శివ, చక్రవర్తుల మాధవాచార్యులు, గండికోట సూర్యనారాయణ అర్చకత్వంలో చిన్నారులు సరస్వతీ అష్టోత్తర సహస్ర నామాలతో సామూహిక సరస్వతీ పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు సరస్వతీదేవి ప్రతిమను, రక్షాబంధనాన్ని ప్రసాదంగా అందజేశారు.

భవానీ భక్తుల మృతదేహాలు లభ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో స్నానానికి వెళ్లి ఊబిలో కూరుకుపోయి గల్లంతైన భవానీ భక్తుల మృతదేహాలు లభ్యమయ్యాయి. గోకవరం మండలం పెంటపల్లి గ్రామానికి చెందిన ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఉంటున్న గుబ్బల బాపిరాజు (28), అతని బావమరిది రాజానగరం శ్రీరామపురానికి చెందిన రాయుడు వీరబాబు (24)ల మృతదేహాలు వేమగిరి వద్ద కాలువలో లభ్యమయ్యాయి. శనివారం సాయంత్రం భవానీలు బాపిరాజు, వీరబాబు పుష్కర ఘాట్‌లో స్నానానికి వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

ఈవీఎంలతో ఓట్ల దుర్వినియోగం

ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు రుద్రరాజు



మాట్లాడుతున్న ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు రుద్రరాజు

అమలాపురం టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఓట్ల దుర్వినియోగానికి పాల్పడుతుందని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఈవీఎంల విధానం వద్దు.. దాని స్థానే మాన్యువల్ విధానమైన బ్యాలెట్ పత్రాలతోనే ఓటింగ్, పోలింగ్ జరపాలని డిమాండ్ చేస్తోందని చెప్పారు. పలు రాష్ట్రాల్లో జరిగిన ఓట్ల అక్రమాలను కాంగ్రెస్ పార్టీ అనేక ఆధారాలతో బయట పెట్టినప్పటికీ ప్రధాని మోదీ పట్టించుకోకుండా పాలన సాగిస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ ఓట్ల అక్రమాల్లో చంద్రబాబు ప్రభుత్వం కూడా భాగస్వామ్యం అయ్యిందని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఈవీఎంల పరంగా వైఎస్సార్ సీపీకి జరిగిన అన్యాయాన్ని ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ కూడా ప్రస్తావించారని ఆయన గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుగుతున్న ఓట్ల అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ సంతకాలను సేకరిస్తూ ప్రజల నుంచి మద్దతు కూడగడుతోందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కొత్తూరి శ్రీనివాస్, అయితాబత్తుల సుభాషిణి, వంటెద్దు బాబి, ముషిణి రామకృష్ణారావు, యార్లగడ్డ రవీంద్ర, కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. చివరగా అమలాపురం ప్రెస్‌క్లబ్ భవనంలో ఫర్నీచర్ కొనుగోలు నిమిత్తం రుద్రరాజు రూ.25 వేల చెక్కును ప్రెస్‌క్లబ్ ప్రతినిధులకు అందజేశారు.

అంతర పంటగా అశ్వగంధను సాగు చేయొచ్చు



తెలంగాణ ఆయిల్‌ఫెడ్ సంస్థ ప్రతినిధులతో నిర్కా డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆయిల్ పామ్ తోటల్లో మూడేళ్ల వరకూ అశ్వగంధను అంతర పంటగా సాగు చేయవచ్చని జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ (నిర్కా) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. సోమవారం తెలంగాణ ఆయిల్ సీడ్ ఫెడరేషన్ సంస్థ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని నిర్కాను సందర్శించి అశ్వగంధ పంటను ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా సాగు చేయడానికి, అధిక దిగుబడులు పొందడానికి, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఉన్న అవకాశాలను విశ్లేషించడానికి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేషుమాధవ్ మాట్లాడుతూ అన్ని నేలల్లో అశ్వగంధ వేయవచ్చని తెలిపారు. అంతే కాకుండా అశ్వగంధ సాగుకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి సహకరిస్తామన్నారు. అశ్వగంధ పంట మార్కెటింగ్, బైబ్యాక్ విధానాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం, ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. పలు అంశాలను విశ్లేషించి ఆయిల్‌ఫెడ్ సలహాదారుడు ఎ.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ముసాయిదాను రూపొందించడానికి నిర్ణయించారు. నిర్కా సంస్థ పరిధిలో చేస్తున్న మిరప, పసుపు పంట ఉత్పత్తులను తెలంగాణ ఆయిల్‌ఫెడ్ వారి విజయబ్రాండ్ స్టోర్స్‌లో చేర్చి అమ్మడానికి ఉన్న అవకాశాలను చర్చించి ఎంఓయూ ఏర్పాటు చేసి సంయుక్తంగా ముందుకెళ్లాలని రెండు సంస్థలు నిర్ణయించారు. సమావేశంలో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అధికారులు టి.సుధాకరరెడ్డి, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, అభ్యుదయ రైతులు భాస్కర్, అప్పారావు, నిర్కా సంస్థ విజన్ హెడ్స్ కె.సరళ, రాజశేఖర్, ఎల్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ శాస్త్రవేత్తలు కస్తూరి, సుబ్బయ్య, సుమన్‌కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



కోమలి మహేష్ (ఫైల్)

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరం గ్రామానికి చెందిన కోమలి మహేష్ (26) మృతదేహాన్ని సోమవారం సిద్ధాంతం లాకుల వద్ద పంట కాలువలో గుర్తించినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు తెలిపారు. విజ్జేశ్వరానికి చెందిన మహేష్ ఈ నెల 26న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆ యువకుడి తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. అతని మృతిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్సై బాలాజీ వివరించారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘ ఎన్నిక



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఖోఖో సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఖోఖో సంఘ అధ్యక్షుడిగా సీనియర్ పీడీ కె.పట్టాభిరామ్ ఎన్నికయ్యారు. సోమవారం కాకినాడలోని కుడుపూడి రామ్‌కుమార్ క్రీడాభవన్‌లో జిల్లా ఖోఖో సంఘ ఎన్నికలు రాష్ట్ర ఖోఖో సంఘ అధ్యక్షుడు టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ ఎన్నికలకు జిల్లా ఒలింపిక్ సంఘ నుంచి వి.రవిరాజు, డీఎస్‌ఏ పరిశీలకులుగా పాపారావు హాజరయ్యారు. అలాగే ఎన్నికల పరిశీలకుడిగా అడ్వకేట్ ఎం.సత్యనారాయణ వ్యవహరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి అధ్యక్షుడిగా కె.పట్టాభిరామ్, కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్ కుమార్, కోశాధికారిగా కె.రాంబాబు, ఉపాధ్యక్షులుగా ఎల్.గోవిందరాజులు, కె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా మాచరరావు, ఎండీ ఇబ్రహీం, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా పి.సూర్యనారాయణ, డి.సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు టీవీఎస్ రంగారావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి నాగు, చీఫ్ టెక్నికల్ అడ్వయిజర్ సాయిప్రసాద్, బంగార్రాజులు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించి మరోసారి ఖోఖో సంఘ ఐక్యతను చాటి చెప్పారని కొనియాడారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో పోస్టులు సాధించిన ఖోఖో క్రీడాకారులు వై.జగదీష్, బి.ఆదినారాయణ, వై.సతీష్‌లను సంఘ సభ్యులు అభినందించారు.

మున్సిపాలిటీ గ్రూపు నుంచి బయటకు..

సచివాలయ సెక్రటరీల నిరసన

అమలాపురం టౌన్: వలంటీర్ల మాదిరిగా తమను ఇంటింటికీ పంపించి పథకాలపై ప్రచారం చేయిస్తూనే, సర్వే చేయమని ఒత్తిడి తెస్తున్న పరిణామాలపై అమలాపురం మున్సిపాలిటీలోని 15 వార్డు సచివాలయాల సెక్రటరీలు అభ్యంతరం చెబుతున్నారు. ఈ సర్వేలను వ్యతిరేకిస్తూ మున్సిపాలిటీ అధికారిక వాట్సాప్ గ్రూప్ నుంచి సోమవారం వార్డు సెక్రటరీలు లెఫ్ట్ అవడం మొదలు పెట్టారు. మున్సిపాలిటీలోని 15 వార్డు సచివాలయాల్లో 139 మంది వివిధ విభాగాల సెక్రటరీలుగా పనిచేస్తున్నారు. ఇందులో సోమవారం రాత్రికి 80 మందికి పైగా సెక్రటరీలు గ్రూప్ నుంచి లెఫ్ట్ అయ్యారు. మంగళవారం కూడా మరికొంత మంది సెక్రటరీలు బయటకు రానున్నారని ఓ వార్డు సచివాలయ సెక్రటరీ చెప్పారు. మున్సిపాలిటీ అఫీషియల్ వాట్సాప్ గ్రూపు ప్రతి మున్సిపాలిటీకి ఉంటుంది.

ఇందులో మున్సిపాలిటీకి చెందిన కమిషనర్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు ఉంటారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి చేసే పనులను తమకు అప్పగించడంపై వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల పదో తేదీన విజయవాడలో చేపట్టనున్న రాష్ట్ర స్థాయి మార్చ్‌ఫాస్ట్‌కు మున్సిపాలిటీలోని సెక్రటరీలు వెళ్లి నిరసన తెలిపేందుకు ఇప్పటికే సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఇంటింటికీ వెళ్లి పలు ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రచారం, సర్వే భారాన్ని మోపడాన్ని వార్డు సచివాలయ సెక్రటరీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

దసరా సెలవులకు వచ్చి.. గోదావరిలో పడి విద్యార్థి మృతి



నక్కా అఖిల్ (ఫైల్)



కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అఖిల్ మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి కుమారి

కొత్తపేట: దసరా సెలవులకు తమ కొడుకు ఇంటికి వచ్చాడని ఆనందించిన ఆ తల్లిదండ్రులకు అనుకోని ఘటన కడుపుకోతను మిగిల్చింది. సెలవులకు కళాశాల హాస్టల్ నుంచి ఇంటికి వచ్చి, స్నేహితులతో సరదాగా గోదావరిలో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి మృత్యువాత పడిన ఘటన ఆ కుటుంబంలో విషాదాన్ని నిలిపింది.. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేట మండలం వానపల్లి శివారు నక్కావారిపేటకు చెందిన నక్కా రాంబాబు, కుమారి దంపతుల కుమారుడు అఖిల్ (19) పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అక్కడ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న అఖిల్ దసరా పండగ సందర్భంగా కళాశాలకు సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం తన తమ్ముడు, నలుగురు స్నేహితులతో కలసి ఇంటికి సమీపంలోని గోదావరి తొగరిపాయలో స్నానానికి వెళ్లాడు. అక్కడ ఒక అరటి బొంద కనిపిస్తే దానిపై అఖిల్‌తో పాటు యడ్ల రవితేజ అనే విద్యార్థి ఎక్కి ఈతకొడుతూ జారిపోయి గల్లంతయ్యారు. అక్కడికి సమీపంలోనే మత్స్యకార కాలనీ వాసులు గమనించి వెంటనే గోదావరి పాయలో దూకి గల్లంతైన విద్యార్థులను ఒకరి తరువాత ఒకరిని పట్టుకుని ఒడ్డుకు చేర్చగా, వారిలో అఖిల్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు వెంటనే కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై స్థానిక ఎస్సై జి.సురేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తనలా కుమారుడు కాకూడదని..

నక్కావారిపేటకు చెందిన నక్కా రాంబాబుది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. అతను కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు. ఇందులో అఖిల్ పెద్ద కుమారుడు. తన కుమారులు కూలి పనికి వెళ్లకుండా గౌరవప్రదమైన ఉద్యోగం చేయాలనే కోరికతో డబ్బు ఖర్చయినా గాని భీమవరంలో ఓ ప్రైవేట్ కళాశాలలో చేర్చి చదివిస్తున్నాడు. ఉన్నత చదువులు చదివి తనకు పేరు తెస్తాడని ఆశించాడు. అఖిల్ దసరా సెలవులకు వచ్చి ఇలా మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. ఈ దుర్ఘటన ఆ గ్రామంలో తీవ్ర విషాదచాయలు నింపింది.